VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 13 గురువారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 229

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

# ప్రజలే కేంద్రంగా పాలన

సమృద్ధి, సమానత్వం, పురోగతిలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలుస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తెలిపారు. సామాజికన్యాయంతో వినూత్నంగా అపరిమిత అవకాశాల దిశగా ప్రయాణం వేగవంతంగా సాగుతోందని అభివర్ణించారు.

సమృద్ధి, సమానత్వం, పురోగతిలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ

అపరిమిత అవకాశాల దిశగా వేగవంతంగా ప్రయాణం

వెన్నుదన్నుగా నిలుస్తున్న నిర్ణయాత్మక నాయకత్వం, ధైర్యంగా సంస్కరణలు



## అబద్ధాల ప్రాతిపదికన
# రాష్ట్రాన్ని నడపను



2లో

- ఆర్థిక క్యాన్సర్‌ను ఎన్నాళ్లు దాచిపెట్టాలి?
- కేసీఆర్ రాష్ట్రానికి అప్పులు, తప్పులు ఇచ్చి వెళ్లారు
- నిజం చెబుతుంటే 'రాష్ట్రం పరువు తీస్తున్నావు... దిగిపో' అంటున్నారు
- ఫ్యామిలీ ప్యాకేజీలా అసత్యాలను ప్రచారం చేస్తున్నారు
- అధ్యాపకుల నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

"కేసీఆర్ రాష్ట్రానికి ఆర్థిక క్యాన్సర్‌ను ఇచ్చి వెళ్లారు. అది రోజురోజుకూ ముదురుతుంటే సిక్స్ ప్యాక్ ఉందని, కండలున్నాయని ఎన్నాళ్లు అబద్ధాలు చెప్పాలి? నేను ఉన్నది ఉన్నట్లు చెబుతుంటే 'రాష్ట్రం పరువు తీస్తున్నావు.

# కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది



హైదరాబాద్: 'రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయి. 480 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. గవర్నర్ ప్రసంగంతో రైతులకు సాంత్వన, భరోసా, ఉపశమనం కల్పిస్తారు అనుకున్నాం. ఆరు గ్యారంటీలు, 420 హామీల వైఫల్యాల గురించి చెబుతారు అనుకున్నాం. గత 15 నెలల పాలనపై ప్రాయశ్చిత్తం చేసుకుంటారు అని భావించా.. కానీ అసలది గవర్నర్ ప్రసంగంలా లేదు.. గాంధీభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది. గవర్నర్ నోటా అర్ధసత్యాలు పలికించారు' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శాసనసభలో బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం అనంతరం భారాస ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 25 నుంచి 35 శాతం మించి రుణమాఫీ కాలేదు. ఈ విషయంలో అబద్ధాలు చెప్పి గవర్నర్ స్థాయిని దిగజార్చారు. రైతుబంధుతోపాటు రైతుకూలీలకు కూడా సాయం వచ్చిందని చెప్పించారు. పంటలకు రైతులు నిప్పు పెడుతున్నారు. ఎండుతున్న పంటలు, సాగు సంక్షోభం, రైతు ఆత్మహత్యల గురించి ప్రస్తావనే లేదు. సచివాలయంలోనే ఉప ముఖ్యమంత్రి ఛాంబర్ ముందు గుత్తేదారులు ధర్నా చేసే పరిస్థితి వచ్చింది. గుత్తేదారుల నుంచి 20 శాతం కమీషన్లు అడుగుతున్నారు. వీటితో దిల్లీకి మూటలు పంపుతున్నారు.

రూ.1.62 లక్షల కోట్లు ఏం చేశారు?

కేసీఆర్ ప్రభుత్వం రూ.4.17 లక్షల కోట్ల అప్పులు చేస్తే.. పదేళ్లలో రూ.4.50 లక్షల కోట్లు వ్యవసాయం, సాగునీటి రంగానికే ఖర్చు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.1.62 లక్షల కోట్ల అప్పులు తెచ్చిందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. ఈ డబ్బులను ఏం చేశారు? దేశంలోనే వరి ధాన్యంలో రాష్ట్రం నంబర్-1గా ఉండడానికి కారణం ఎవరు? కేసీఆర్ కాదా? రేవంత్‌రెడ్డితో నంబరు-1 అయ్యిందా? గ్రామాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను రైతులు తరిమికొట్టే పరిస్థితి వచ్చింది. మంత్రులకు 30 శాతం కమీషన్ ఇస్తేనే బిల్లులు వస్తున్నాయని స్వయానా కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేనే చెబుతున్నారు. వీటన్నిటిపై ప్రభుత్వాన్ని గవర్నర్ మందలిస్తారని అనుకున్నాం. దావోస్ పర్యటనలో రూ.1.79లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ ద్వారా అబద్ధాలు చెప్పించారు. గతేడాది చెప్పిన రూ.40 వేల కోట్లలో 40పైసలు కూడా రాలేదు. పెట్టుబడులపై శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేయాలి. రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు గుజరాత్, తమిళనాడు, ఏపీకి తరలివెళ్లాయి. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలు 46 శాతానికి ఎలా వచ్చారని ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీనే ప్రశ్నిస్తున్నారు. సచివాలయంలోని కాంగ్రెస్ తల్లిని, బయట ఉన్న రాహుల్ తండ్రి విగ్రహాలను మూడేళ్ల తర్వాత మేం అధికారంలోకి రాగానే గాంధీభవన్‌కు పంపిస్తాం' అని కేటీఆర్ చెప్పారు.

'రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయి. 480 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. గవర్నర్ ప్రసంగంతో రైతులకు సాంత్వన, భరోసా, ఉపశమనం కల్పిస్తారు అనుకున్నాం. ఆరు గ్యారంటీలు, 420 హామీల వైఫల్యాల గురించి చెబుతారు అనుకున్నాం.




2లో..

## తెలంగాణలో మండే కాలం ఎండల తీవ్రత పెరుగుతోంది

వాతావరణశాఖ హెచ్చరిక



2లో..


## రైలు హైజాక్ ఘటన.. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది: పాక్ ఆర్మీ

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలోకి హైడ్రాలిక్ పవర్డ్ రోబో

మహబూబ్‌నగర్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. టన్నెల్‌లోని చివరి 40 మీటర్ల వరకు ప్రమాదకరంగా ఉండడంతో అక్కడ రోబోలను వినియోగించనున్నారు. బుధవారం అన్వి రోబోటిక్ సంస్థకు చెందిన అటానమస్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో (స్లడ్జ్ రిమూవల్ రోబో) టన్నెల్ వద్దకు తెప్పించారు. సంస్థ ప్రతినిధులు, సహాయక బృందాలతో కలిసి దాన్ని టన్నెల్‌లోని ప్రమాద స్థలానికి తరలించారు. దానితో బురదతో కూడిన నిక్షేపాలను తొలగించనున్నారు. సహాయక సిబ్బంది చేరలేని ప్రాంతాల్లో ఇవి 15 రెట్లు అత్యధిక సామర్థ్యంతో పనిచేస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ రోబో ద్వారా 40 హెచ్‌పీ పంపు సాయంతో బురదను బయటకు పంపనున్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణలో అనుమానిత ప్రాంతాలైన డీ1, డీ2ల వద్ద తవ్వకాలు చేపడుతున్నారు. డీ2 వద్ద కేరళ జాగిలాలు మరోసారి వాసన పసిగట్టడంతో మూడు రోజులుగా తవ్వకాలు జరిపారు. ఆ ప్రాంతాల్లో టీబీఎంకు సంబంధించిన లోహపు శకలాలు మాత్రమే కనిపించాయి. డీ1 నుంచి డీ2 మధ్య టీబీఎంకు సంబంధించిన మెటల్ ప్లాట్‌ఫాం ఉంది. దాన్ని కత్తిరించి అక్కడ పేరుకుపోయిన శిథిలాలను తొలగిస్తే గల్లంతైన కార్మికుల ఆచూకీ దొరికే అవకాశంఉందని అంచనాకు వచ్చారు. ఫ్లాట్‌ఫాం క్యాబిన్‌ను ప్లాస్మా, గ్యాస్ కటింగ్ పరికరాలతో కత్తిరించి శిథిలాలను తొలగిస్తున్నారు. ఈ నెల 9న లభ్యమైన గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం బుధవారం పంజాబ్‌లోని తరన్‌తరాన్ జిల్లా చీమకలన్ గ్రామానికి చేరుకుంది. ఇక్కడి నుంచి వెళ్లిన ప్రభుత్వ అధికారుల బృందం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించింది. ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల చెక్కును గుర్‌ప్రీత్ భార్య రజ్వీందర్‌కౌర్‌కు అందజేశారు.



## డీసీఎంఎస్‌లపై ప్రభుత్వ నిర్ణయం
# వివక్షాపూరితం



హైదరాబాద్: జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల(డీసీఎంఎస్‌ల) పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ఆ స్థానంలో అదనపు కలెక్టర్లను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 75 అమలును నిలిపివేస్తూ హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం వివక్షాపూరితమైనదిగా పేర్కొంది. డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జులుగా అదనపు కలెక్టర్(రెవెన్యూ)లను నియమిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరి 14న జారీ చేసిన జీవో 75, దాని ఆధారంగా ఫిబ్రవరి 25న సహకార శాఖ కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఖమ్మం మినహా మిగిలిన 8 ఉమ్మడి జిల్లాలకు చెందిన డీసీఎంఎస్ డైరెక్టర్లు హైకోర్టులో వేర్వేరుగా 8 పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ కె.శరత్ విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి... అన్నింటికీ ఒకే రోజు పదవీ కాలం ముగిసినా ప్రభుత్వం డీసీఎంఎస్‌ల విషయంలో భిన్నమైన నిర్ణయం తీసుకోవడానికి ఎలాంటి కారణాలను పేర్కొనకపోవడాన్ని తప్పుబట్టారు. ఇది వివక్షాపూరితమైన నిర్ణయమని పేర్కొన్నారు. పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకం సమయంలో పాలకవర్గం కొనసాగుతున్న తీరును పరిగణనలోకి తీసుకుని కొత్త వారిని నియమించడంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందంటూ ఇదే హైకోర్టు గతంలో వెలువరించిన తీర్పులకు విరుద్ధంగా ప్రస్తుత నిర్ణయం ఉందన్నారు. జీవో 75 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. మిగతావాటి మాదిరిగానే డీసీఎంఎస్‌లకు పాత డైరెక్టర్లనే పర్సన్ ఇన్‌ఛార్జులుగా కొనసాగించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

వేగుచుక్క

# తెలంగాణలో మండే కాలం

**హైదరాబాద్:** మార్చి 13 నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వేడి గాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్ధిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు

# రైలు హైజాక్ ఘటన.. ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది: పాక్ ఆర్మీ

**పాకిస్థాన్‌లో రైలు హైజాక్ అయిన ఘటనలో భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్లు పాక్ ఆర్మీ జనరల్ పేర్కొన్నారు.**

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో రైలు హైజాక్ అయిన ఘటనలో మొత్తం 21 మంది ప్రయాణికులతో పాటు నలుగురు పారామిలిటరీ సైనికులు మృతి చెందినట్లు పాక్ ఆర్మీ జనరల్ పేర్కొన్నారు. పాక్ భద్రతా బలగాల కాల్పుల్లో మొత్తం 33 మంది మిలిటెంట్లు మృతి చెందారని ఆర్మీ అధికార ప్రతినిధి, లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ తెలిపారు. రైలులో ఉన్న అందరు మిలిటెంట్లను భద్రతా బలగాలు హతమార్చాయని, ఆపరేషన్ విజయవంతంగా ముగిసిందని ఆయన పేర్కొన్నారు. మిగిలిన ప్రయాణికులను కాపాడామని వెల్లడించారు.బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతమైన క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు జాఫర్ ఎక్స్‌ప్రెస్ వెళ్తున్న బలోచ్ లిబరేషన్ ఆర్మీ మిలిటెంట్లు రైలును హైజాక్ చేసిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన సమయంలో 9 కోచ్‌లలో మొత్తం 440 మంది ప్యాసింజర్లు ఉన్నారు. ఈ ఘటనకు తామే బాధ్యులమని బీఎల్‌ఏ మిలిటెంట్లు ప్రకటించారు. దీంతో రంగంలోకి దిగిన బలగాలు విజయవంతంగా రైలును తమ నియంత్రణలోకి తీసుకున్నాయి.

చరిత్రలో రైళ్లు హైజాక్ అయ్యాయి..!

రైలు హైజాక్ ఘటనకు సంబంధించి లెఫ్టినెంట్ జనరల్ షరీఫ్ ఓ టీవీ ఛానల్‌తో మాట్లాడారు. "మార్చి 11న మధ్యాహ్నం 1 గంట సమయంలో బలోచ్ మిలిటెంట్లు రైల్వే ట్రాక్ పేల్చేసి రైలును తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఆ ప్రాంతమంతా కష్టతరమైన భూభాగం. మిలిటెంట్లు ప్రయాణికులను రక్షణ కవాచాలుగా ఉపయోగించుకున్నారు. వెంటనే ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, ఫ్రాంటియర్ కార్ప్స్, స్పెషల్ సర్వీస్ గ్రూప్ కమాండోస్‌తో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాం. ఈ ఆపరేషన్ సమయంలో మిలిటెంట్లు అఫ్గాన్‌లోని తమ సహాయకులు, సూత్రధారులతో శాటిలైట్ ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు చర్చలు జరిపారు. ప్రయాణికులను రక్షణ కవచాలుగా ఉంచుకోవడంతో ఈ ఆపరేషన్ ముగించడానికి సమయం పట్టింది. మంగళవారం సాయంత్రానికి 100 మంది ప్యాసింజర్లను సురక్షితంగా కాపాడాం. ఇక బుధవారం మిగిలిన మొత్తం ప్రయాణికులను కాపాడాం. ఈ ఆపరేషన్ అత్యంత కచ్చితత్వంతోపాటు, జాగ్రత్తగా చేయాల్సి వచ్చింది.

ఆత్మాహుతి బాంబర్లను మొదట స్నిపర్స్ చంపేశారు. అనంతరం ఒక్కో కంపార్ట్‌మెంట్‌లోని టెర్రరిస్టులను హతమారుస్తూ వచ్చాం. తమ ఆరరేషన్ సమయంలో ప్రయాణికులకు ఎవరికి ఏం జరగలేదు. ప్రస్తుతం ఘటన ప్రాంతంలో మిలిటెంట్లు ఎవరూ బతికిలేరు. అయితే బాంబు నిర్వీర్య దళం రైలును చెక్ చేస్తోంది. తమ ఆపరేషన్ కొనసాగుతున్న సమయంలో పారిపోయిన ప్రయాణికులను ఒక్కదగ్గరికి చేర్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మిలిటెంట్లు, వారికి సహాయం చేసేవారు ఎక్కడున్నా వదిలేదు లేదు. పాకిస్థానీయులను లక్ష్యంగా చేసుకునే ఏ విదేశీ శక్తుల ఆటలు సాగనివ్వం" అని పేర్కొన్నారు. రైలు హైజాక్ ఘటన తమ భద్రత పరిస్థితినే పూర్తిగా మార్చివేసిందని షరీఫ్ తెలిపారు.

# దవలవారీగా ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు

**ఫీజుల చెల్లించకుండా బకాయి పెట్టిన జగన్ ప్రభుత్వం**

**మండలిలో స్వల్పకాలిక చర్చలో మంత్రి లోకేశ్ హామీ**

అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పీజీ విద్యార్థులకు గత ప్రభుత్వం తొలగించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ను తిరిగి తీసుకువస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వమే బకాయిలు పెట్టిందని, దీనిపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ చేశారు. సభలో చర్చించకుండా వైకాపా సభ్యులు బయటకు వెళ్లిపోయి తోకముడిచారని ఎద్దేవా చేశారు. విద్యాశాఖలో సంస్కరణలపై శాసన మండలిలో స్వల్ప వ్యవధి చర్చ జరిగింది. ఈ

సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. జీవో 117 వల్ల 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. టీచర్లపై గతంలో పెట్టిన కేసులన్నింటినీ మాఫీ చేసే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గిస్తున్నామని, నోట్ బుక్‌లు, పుస్తకాలు, బెల్టులు, బ్యాగ్‌లు, చిక్కీల పైనా గత సీఎం జగన్ తన ఫొటో ముద్రించుకోగా.. ఇకపై ప్రభుత్వ ముద్రతోనే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ రంగుల్లేకుండా సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యా కిట్లు ఇస్తామన్నారు. పిల్లలకు యూనిఫాంలు మార్చి.. నాణ్యమైనవి ఇస్తున్నామన్నారు. భారం లేకుండా పుస్తకాల సంఖ్య తగ్గించినట్లు తెలిపారు. పుస్తకాలు, బ్యాగ్‌లపై ప్రభుత్వ లోగో ఉంటుంది కానీ, సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రి ఫొటోలు ఎక్కడా పెట్టలేదన్నారు. రాబోయే 5 ఏళ్లలో చిక్కీల కింద రూ. 240 కోట్లు, కోడి గుడ్లపై రూ.144 కోట్లు ప్రభుత్వం సేవ్ చేస్తుందని, చాలా పారదర్శకంగా టెండర్లు పిలిచి ప్రభుత్వ సొమ్ము ఆదా చేశామన్నారు. ప్రతి గ్రామానికి మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనేది లక్ష్యమన్నారు. 1 క్లాస్ 1 టీచర్ విధానాన్ని అమలు చేయాలన్నది లక్ష్యమని, కేజీ నుంచి పీజీ వరకు సిలబస్ మానిటరింగ్ చేస్తామన్నారు. పుస్తకాల్లో ప్రతి ఛాప్టర్‌కు క్యూఆర్ కోడ్ అమలు చేస్తున్నామన్న లోకేశ్.. ప్రతి శనివారం 'నో బ్యాగ్ డే' గా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అమరావతిలో ప్రపంచస్థాయిలో టీచర్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి సీనియారిటీ జాబితాను ప్రకటించామని, జాబితాపై అభ్యంతరాలు తీసుకున్న తర్వాత ఆన్‌లైన్ చేస్తామన్నారు. టీచర్ ట్రాన్స్‌ఫర్ యాక్టును అమలు చేస్తామని, డీఎస్సీ నోటిఫికేషన్ తప్పకుండా విడుదల చేస్తామన్నారు. ఈ ఏడాదిలోపే ఉపాధ్యాయులను నియమించే బాధ్యత తీసుకుంటామన్నారు.

# మండలిలో వాయిదా తీర్మానాల గొడవ

అమరావతి: ఏపీ శాసనమండలి సమావేశాలు బుధవారం ఉదయం ప్రారంభం కాగానే వాయిదా తీర్మానలపై చర్చకు వైకాపా పట్టుబట్టింది. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో ఛైర్మన్ పదినిముషాలు సభను వాయిదా వేశారు. సభ మొదలైన వెంటనే వైసీపీ సభ్యుల ఆందోళనలతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలిలో విద్యారంగ సమస్యలపై వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. అయితే వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ మోషేన్‌రాజు తిర్కరించారు. దీంతో వాయిదా తీర్మానంపై చర్చకు వైసీపీ సభ్యులు

పట్టుబట్టారు. నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పన , ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై నినాదాలు చేశారు. అంతే కాకుండా ఛైర్మన్ పోడియం వద్దకు దూసుకెళ్లి ప్లకార్డులతో నిరసనకు దిగారు వైసీపీ ఎమ్మెల్సీలు. దీంతో సభలో రచ్చ చోటు చేసుకుంది. వైసీపీ ఆందోళనపై మండలిలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# దొంగలు కాదు..ఘరానా దొంగ పన్నాగం

**చిత్తూరు:** చిత్తూరులో కాల్పుల ఘటనలో కీలక మలుపు చోటు చేసుకుంది. ఓ ప్రముఖ వ్యాపారి ఇంట్లో మరో ప్రముఖ వ్యాపారి దోపిడీకి పన్నాగం పన్నినట్లు పోలీసులు గుర్తించారు.

చిత్తూరులోని గాంధీరోడ్డులో ఉదయం కాల్పులు కలకలం సృష్టించాయి. లక్ష్మీ సినిమా హాల్ సమీపంలో ఉన్న పుష్ప కిడ్స్ వరల్డ్ యజమాని చంద్రశేఖర్ ఇంట్లోకి దొంగల ముఠా చొరబడింది. రెండు తుపాకులతో వారు గాల్లోకి కాల్పులు జరిపారు. యజమాని అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకుని ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. తుపాకులు, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో యజమాని చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చంద్రశేఖర్ ఇంట్లో దోపిడీకి ఎస్‌ఎల్‌వీ ఫర్నీచర్ యజమాని ముఠాను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. కర్ణాటక, ఉత్తరాదికి చెందిన దుండగులు ఈ ముఠాలో సభ్యులుగా ఉన్నారు. రబ్బర్ బు÷-లలెట్లు వినియోగించే తుపాకులతో ఇంట్లో దోపిడీకి యత్నించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. రెండున్నర గంటల పాటు ఆపరేషన్ నిర్వహించారు.

# అబద్ధాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపను

**హైదరాబాద్:** తెలంగాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని.. కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన 1292 మంది జూనియర్ లెక్చరర్లకు, 240 మంది పాలిటెక్నికల్ లెక్చరర్లకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరమన్నారు. కొత్తగా నియామకమైనవారు తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగాలపై కోర్టుల్లో చిక్కుముడులు విప్పుతూ సమస్యలు పరిష్కరిస్తున్నా మన్నారు. తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలతో గవర్నమెంట్ విద్యాలయాలు పోటీ పడలేకపోవడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువు చెప్పే వారికన్నా గవర్నమెంట్ లెక్చరర్లకే ఎక్కువ నాలెడ్జ్ ఉందని.. అయినా రిజల్ట్ వారికంటే తక్కువ రావడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను తీర్చి దిద్దాలని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే..ఆ కుటుంబ భవిష్యత్ మారిపోతుందని.. వారి కష్టాలన్నీ తొలగిపోతాయని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని నోటిఫికేషన్లు ఇచ్చి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడటంలో నిరుద్యోగుల పాత్ర కీలకం అని గుర్తు చేశారు.ఉద్యోగ బాధ్యతలు




చేపడుతున్న వారికి సీఎం అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటల ప్రకారం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అయినా మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అభివృద్ధి పథంలో నడిస్తే భవిష్యత్‌తరాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగం కూడా ఒక కారణమన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోవడం వల్లే ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని గ్రహించాలన్నారు. 55 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదని.. అది వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని చెప్పుకొచ్చారు.

తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించామని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉండాలన్నారు. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచానికే తెలంగాణ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు మన దేశ ప్రతిష్టను పెంపొందిస్తాయని చెప్పుకొచ్చారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామన్నారు. పారాలింపిక్స్ క్రీడాకారిణి దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం ఇచ్చామని అన్నారు. కొంతమంది స్ట్రేచర్ స్ట్రేచర్ అని మాట్లాడుతున్నారని.. స్ట్రేచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రేచర్ మీదకు వెళ్లారన్నారు. స్ట్రేచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదని తెలిపారు. కేసీఆర్ తమకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అని అన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని.. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా

అని అంటున్నారని.. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారని అన్నారు. తాను వాస్తవాలు చెబుతుంటే? దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్‌లా అబద్దాలు మాట్లాడు తున్నారన్నారు. 'అబద్దాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపను. వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం. ఎంతసేపు సీఎం కుర్చీని లాక్కుంటామంటే ఎలా.. నన్ను పనిచేయనివ్వాలి కదా మీరు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సిఎస్ శాంతికుమారి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలే కేంద్రంగా పాలన



**హైదరాబాద్:** అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పతి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం గవర్నర్‌ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని, వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకు న్నామన్నారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ అని అన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని గవర్నర్ వెల్లడించారు. ల్గ÷తులకు మద్దతివ్వడం, వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. దేశంలోనే ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని.. ఇదే రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 23.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగశ్రేణి శిక్షణ అందుతోంది.

# మార్చి 27 వరకు అసెంబ్లీ సమావేశాలు

**17,18 తేదీల్లో బిసి రిజర్వేషన్లపై చర్చ**

**19న బడ్జెట్..21,22 తేదీల్లో చర్చ**

**బిఎసి సమావేశంలో నిర్ణయం**

హైదరాబాద్,: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మార్చి 27 వరకు జరుగుతాయి. 14న హోలీ, 16న ఆదివారం, 20, 23న సెలవులు ఉన్నాయి. ఈ నాలుగు రోజులు మినహాయించి 12 రోజులు సమావేశాలు జరగబోతున్నాయి. చాలా రోజుల తర్వాత మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటారని కెటిఆర్ ఇప్పటికే ప్రకటించారు. అటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును 15వ తేదీన ప్రవేశపెట్టబోతోంది. 17, 18వ తేదీల్లో బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా చర్చలు జరుపుతారు. కీలకమైన బడ్జెట్ ను 19వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రవేశ పెడుతారు. 20వ తేదీన సెలవు కాబట్టి 21, 22వ తేదీల్లో బడ్జెట్ మీద చర్చిస్తారు. 24 ,



25, 26వ తేదీల్లో పద్దులపై చర్చలు జరుపుతారు. చివరగా 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశ పెడుతారు. ఈ సమావేశాలు అత్యంత కీలకం కానున్నాయి. ఎందుకంటే బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం బీసీలంతా ఎదురు చూస్తున్నారు. ఈ బిల్లులో బీసీ రిజర్వేషన్ల కోటాపై స్పష్టత వస్తే కీలక పరిణామాలు చోటుచేసుకుంటాయి. అంతే కాకుండా కేసీఆర్ ఓడిపోయిన తర్వాత మొదటిసారి అసెంబ్లీలో ప్రసంగించబోతున్నారు. ప్రతిపక్షాలకు ధీటుగా సమాధానాలు చెప్పాలని రేవంత్ ప్రభుత్వం కసరత్తులు స్టార్ట్ చేసింది. కాబట్టి గతంలో జరిగిన సమావేశాల కంటే ఈ సమావేశాలు మరింత వేడెక్కడం ఖాయం. స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలో అసెంబ్లీ పనిదినాలపై చర్చించారు. అసెంబ్లీలో స్పీకర్ ఛాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈనెల 27 వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి.. దానిపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు. అలాగే 14న హోలీ పండుగ నేపథ్యంలో సెలవు ప్రకటించారు. 16న ఆదివారం. 17న ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధతపై చర్చించనున్నారు. 18న బీసీ కులగణన, రిజర్వేషన్లపై చర్చ జరుగనుంది. 21న బడ్జెట్‌పై చర్చించనున్నారు. అలాగే మూడు రోజుల పాటు పద్దులపై చర్చ జరుగనుంది. 27న ద్రవ్యవినిమయ బిల్లుకు ఆమోదం తెలుపుతారు. దాదాపు 11 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. కనీసం 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్ దృష్టికి బీఆర్ఎస్ నేతలు తీసుకెళ్లారు. అయితే ఈనెల 27 వరకు సభను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

వేగుచుక్క

# అన్ని రంగాలలో మహిళలు రాణించాలి.

## - జిల్లా జడ్జి సునీత కుంచాల.








**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 12**

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి సునీత కుంచాల విచ్చేయగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, అదనపు. కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, సమాజంలో సగభాగం అయిన మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అద్భుతాలు సాధించాలని ఆకాంక్షించారు. మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదని, అన్ని రంగాలలోనూ పురుషులతో సమానంగా పోటీపడాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి మహిళ విద్య, క్రీడలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలని అభిలషించారు. మహిళలు తమ హక్కులను, బాధ్యతలను గుర్తెరిగి వాటిని కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. అప్పుడే సమాజంలో సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు, వివిధ
సంస్థల వారు అందిస్తున్న తోడ్పాటును పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. మోసాలకు, అన్యాయాలకు గురైన సందర్భాలలో న్యాయం కోసం పోరాడాలని అన్నారు. జిల్లా స్థాయిలో వివిధ రంగాలలో ఉత్తమ సేవలందించిన మహిళలకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ, మహిళా కమిషన్ మెంబర్ సూదం లక్ష్మీ, డి.యం.హెచ్.ఓ రాజశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి స్రవంతి, డాక్టర్ ప్రతిమారాజ్, రిటైర్డ్ డీడబ్ల్యూవో సరళ, సి డి పి వో లు, సూపర్ వైజర్ లు , అంగన్వాడీ టీచర్లు గ్రామీణాభివృద్ధి శాఖా ఏ పి యం లు, సి సి లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.




# మోడీకి ప్రత్యమ్నాయం ఏదీ!!

దేశ రాజకీయాల్లో ఇప్పుడు నిస్తేజం ఆవరించింది. బిజెపిని ఢీకొనేందుకు ఏర్పడ్డ ఇండియా కూటమి షెడ్డుకు చేరింది. కూటమిగా పనిచేసేందుకు అందులోని పార్టీలు ముందుకు రావడం లేదు. ఎవరికి వారే యమునాతీరే అన్నచందంగా పార్టీల వ్యవహారం సాగుతోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ నిర్మానాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం కుదరడం లేదు. టిఎంసి,డిఎంకె పార్టీలు పార్లమెంటులో సొంత ఎజెండాతో పోతున్నాయి. వాటికి అవసరమైన మేరకు ఆందోళన చేస్తున్నాయి. డిఎంకె జాతీయ విద్యావిధానం, హిందీ వ్యతిరేకతపైనే రాజకీయాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అవతకవలు, ఓటరల జాబితాపై పోరాడుతోంది. మొత్తంగా అన్ని పార్టీల్లోనూ సొంత ఎజెండాలే తప్ప ప్రజల ఎజెండా కానరావడం లేదు. పార్లమెంటులో ప్రజల పక్షాన నిలిచామని చెప్పుకోవడానికి ఈ పార్టీలు పనిచేయలేక పోతున్నాయి. రెండోదఫా పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం అయ్యాయి. బడ్జెట్‌లో ప్రతిపాదించిన అంశాలపై నిలదీసే కార్యక్రమంకానరావడం లేదు. నాయకుడిగా రాహుల్ ఇంకా పరిణతి చెందలేదు. పార్టీ పెత్తనాన్ని అట్టిపెట్టుకోవడం మినహా దేశాన్ని నడిపించే సత్తా ఉందని నిరూపించుకోలేక పోతున్నారు. రాహుల్‌తో పోలిస్తే ప్రియాంక కొంత చురుకుగా ఉంటున్నారు. ఇకపోతే ఢిల్లీ ఎన్నికల ఫలితాల తరవాత ఆప్ ఓటమితో..ప్రత్యామ్నాయ రాజకీయాలకు గండిపడింది. ఆప్ అవినీతి కారణంగా ప్రజలు ఇతర పార్టీలను నమ్మే విధంగా లేరు. దీంతో బిజెపికి తీరుగులదేన్న విధంగా పరిస్థితి మారుతోంది. డబుల్ ఇంజన్ అంటూ మోడీ చేసిన ప్రచారం బాగా పనిచేసిందనే చెప్పాలి. అలాగే మోడీ కాంగ్రెస్ ముక్త భారత్ నినాదానికి మరింత బలం చేకూరింది. మోడీ నాయకత్వానికి తిరుగులేదని నిరూపితం అయ్యింది. బిజెపియే దేశానికి రక్ష అన్న వాదనకు కూడా బలం చేకూరింది. ఇదే సందర్భంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు అంటూ బయలుదేరిన పార్టీలకు ఈ ఫలితాలు ఎదురుదెబ్బగానే భావించాలి. ప్రత్యమ్నాయ రాజకీయాలకు పెద్దగా అనుకూలం కాదని తేలింది. కాంగ్రెస్ కుటుంబ రాజకీయాలను ప్రజలు ఆమోదించడం లేదని వరుస పరిణామాలు రుజువు చేశాయి. అలాగే కాంగ్రెస్ నాయకత్వం మారాల్సిన అవసరాన్ని గుర్తించాలి. రాహుల్, ప్రియాంకలు కాంగ్రెస్ నావను గట్టెక్కించలేరని కూడా తేలిపోయింది. మోడీ ఛరిష్మా తగ్గలేదని కూడా ఢిల్లీ ఫలితాలు మరోమారు రుజువు చేస్తున్నాయి. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అంటూ మోడీ చేసిన ప్రచారం ప్రజలను ఆలోచింపచేసిందనే చెప్పాలి. ఇకపోతే సంప్రదాయ ఓటు అన్నదానికి అర్థం లేకుండా పోతోంది. ఓటర్లు కూడా ఎప్పటికప్పుడు మారుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఫలానా పార్టీకే అంటిపెట్టుకుని ఓటర్లు ఉండడం లేదు. మోడీకి ప్రత్యామ్నాయ నేతగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆవిర్భవించినట్లు ప్రచారం జరిగినా..అవినీతి మరకలు అతడిని అథఃపాతాళానికి తొక్కేశాయి. ఢిల్లీలో రెండుసార్లు అధికారం నిలుపుకోవడంతో పాటు పంజాబ్‌లో అధికారం చేపట్టడంతో తనకు తిరులేదని భావించారు. ప్రధాని పదవిపై కన్నేసి అడ్డమైన గడ్డి తిన్నారు. మోడీకి తానే ప్రత్యామ్నాయం అనుకుని కేజ్రీవాల్ విర్రవీగారు. ఈ క్రమంలో నీచరాజకీయాలకు లోనయ్యారు. ఇక యూపిని తీసుకుంటే యోగి పాలనా దక్షతకు తోడు మోడీ డబుల్ ఇంజిన్ ప్రచారం బాగా పనిచేసింది. యూపిలో వరుసగా రెండోసారి అధికారం నిలుపుకోవడం కూడా బిజెపికి ఓ చరిత్రగా చూడాలి. యూపి ఫలితాలను విశ్లేషించుకుంటే ఎస్పీ బలం పుంజుకుంది. తొలిసారి వంద సీట్లను దాటింది. ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. బిఎస్పీతో పాటు కాంగ్రెస్ కూడా యూపిలో పూర్తిగా తుడిచిపెట్టుకుని పోయే పరిస్థితి ఏర్పడింది. అక్కడ రాహుల్,ప్రియాంకల ప్రచారం ప్రభావం ఏ మాత్రం కనిపించలేదు. ఇందిరతో ప్రియాంకను పోలుస్తూ ఇటీవల దేశంలో పెద్ద ఎత్తున ప్రచారం సాగినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. బిజెపి పట్ల ప్రజలు ఇంకా విశ్వాసంతోనే ఉన్నారు. దీనికి ప్రధాన కారణం అవినీతి రహిత పాలన కూడా బాగా పనిచేసిందనే చెప్పాలి. దేశ ప్రయోజనాలను కూడా ప్రజలు ఆశిస్తున్నారు.

ఆలాగే ప్రత్యామ్నాయ రాజకీయాలకు అడుగు పడుతుందా అన్నది కూడా ఇప్పుడు అనుమానంగా మారింది.

కాంగ్రెస్ తాను గిరిగీసుకున్న చట్రం నుంచి బయటపడాలి. తనను తాను సంస్కరించుకోవాలి. ప్రజాపోరాటాలతో రాటుదేలాలి. కేవలం ఒక్కటంటే ఒక్క పాదయాత్ర చేసి ఇక అంతా అయ్యిందన్న ధీమాలో రాహుల్ ఉన్నారు. అలా అనుకుంటే పొరపాటు. ప్రజలు కాంగ్రెస్‌కే ఎందుకు ఓటేయాలన్న ఆలోచన కలిగించగలగాలి. గతంలో తెలంగాణ సిఎంగా ఉన్న సమయంలో కెసిఆర్ కూడా గుణాత్మక రాజకీయాలు అంటూ బయలు దేరారు. ఆయనకు మమతా బెనర్జీ, ఉద్ధవ్ థాక్రే, స్టాలిన్ లాంటి నేతలు మద్దతు పలికారు. పికె లాంటి వారు వ్యూహాలు పన్నారు. ఫలితాలు బిజెపికి వ్యతిరేకంగా వస్తాయిన అంతా ఆశించారు. కానీ ఇప్పుడు కెసిఆర్ ఫామ్ హౌజ్‌కే పరిమితం అయ్యారు.

# బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పించాలి




బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలని పలు పార్టీల ఎంపీలు డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 27% నుంచి 56%కి పెంచాలని కోరారు.

బీసీ మేధావుల సదస్సులో వక్తల డిమాండ్

బీసీల సమస్యలపై జరిగిన కార్యక్రమంలో ఎంపీలు ఆర్.కృష్ణయ్య, నాగరాజు, మస్తాన్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, బీసీ సంఘాల నేతలు

దిల్లీ: బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లను కల్పించాలని పలు పార్టీల ఎంపీలు డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లను 27% నుంచి 56%కి పెంచాలని కోరారు. దిల్లీలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో బుధవారం జరిగిన బీసీ మేధావుల సదస్సులో పాల్గొన్న భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య, తెదేపా ఎంపీలు బీద మస్తాన్‌రావు, బస్తిపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ, కలిశెట్టి అప్పలనాయుడు, భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్రలు పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగాల ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 22% నుంచి 50%కి పెంచి రాజ్యాంగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్ నిబంధనను తొలగించాలని కోరారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తి నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సదస్సులో తెలంగాణ, ఏపీ బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు గవ్వల భరత్‌కుమార్, ఎన్.మారేష్, దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# కోనసీమ జిల్లాలో ఘోర ప్రమాదం
## గ్యాస్ లీకై 9మందికి అస్వస్థత

అంబేడ్కర్ కోనసీమ: కోనసీమ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మల్కిపురం మండలం కేశనపల్లి-గొల్లపాలెం మధ్య ఓఎన్‌జీసీ గ్యాస్ లీకై తొమ్మిది మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్యాస్ గ్యాథరింగ్ స్టేషన్‌లో ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయ్యింది. ఆ సమయంలో పదుల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది అక్కడ ఉన్నారు. గ్యాస్ లీక్ కావడంతో ప్రమాద స్థలం నుంచి కొంతమంది పరుగులు తీయగా.. మరికొంతమంది లీకేజీని అరికట్టే ప్రయత్నం చేశారు.

అయితే వాసన గాఢంగా రావడంతో అది పీల్చి తొమ్మిది మంది స్పృహ కోల్పోయారు. బాధితులను తోటి సిబ్బంది హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, భారీగా గ్యాస్ వ్యాపించి స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు సైతం ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి, రాజోలు సీఐ టీవీ నరేశ్ కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీజేకీపై దర్యాప్త చేపట్టారు. కాగా, గ్యాస్ లీక్ ఘటన గురించి తెలుసుకున్న స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళకు గురవుతున్నారు.



వేగుచుక్క

# బడ్జెట్ లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి.

## పెండింగ్ ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి.

## ఎబివిపి ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ డిమాండ్.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 12:**

వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఎబివిపి ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎబివిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శశిధర్ మాట్లాడారు. "విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధి కి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ విద్యారంగంపై సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. గత సంవత్సర బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులే కేటాయించిందని, వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదన్నారు. చిన్న రాష్ట్రాలైన ఈశాన్య రాష్ట్రాల్లో సైతం వాటి బడ్జెట్లో 12-13 శాతం నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో అరకొర నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు.

తెలంగాణ రాష్ట్రం లో 90% మంది విద్యార్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులేనని, వారందరూ కూడా ఫీ రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ మీద ఆధారపడి విద్యను అభ్యశిస్తున్నారన్నారు. కానీ ఈ ప్రభుత్వం సుమారు 8000 కోట్ల రూపాయలు పెండింగ్ లో పెట్టి పేద వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థుల దగ్గర నుండే యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తున్నాయని, ఆ ఫీజులు కట్టలేక చాలా మంది విద్యార్థులు విద్యను మధ్యలోనే ఆపేస్తున్నారని, విద్యను పూర్తి చేసిన విద్యార్థులు సైతం సర్టిఫికెట్లు కూడా పొందలేక పోతున్నారన్నారు.

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయలేదని, ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛంద బందుకు పిలుపునిచ్చాయని, అనేక ప్రైవేటు విద్యాసంస్థల యజమానులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు.

గురుకులాల్లో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల కాలంలో 83 మంది పేద పిల్లలు మరణించారని అయినా ఈ ప్రభుత్వం మొద్దునిద్ర వీడట్లేదన్నారు, ఈ మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఆర్బాటంగా ఏర్పాటు చేసిన కామన్ మెనూ కార్యక్రమం అటకెక్కిందని, రోజుకో చోట ఫుడ్ పాయిజన్ నిత్య కృత్యం అయ్యిందన్నారు.

చాలా వరకు గురుకులాలు, డిగ్రీ కళాశాలలు, ఐటిఐ కళాశాలలు పక్కా భవనాలు లేక విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు.

రాష్ట్ర పరిధిలోని 11 విశ్వవిద్యాలయాల్లో ఇది వరకే మంజూరు అయినా టీచింగ్ పోస్టులు 2878 అయితే ప్రస్తుతం కేవలం 753 మంది మాత్రమే టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నది అంటే 70 శాతం ఖాళీలతో కాలం వెళ్లదీస్తున్నాయన్నారు. యువ వికాసం పేరుతో 5 లక్షల రూపాయల కార్డు లను యువతకు జారీ చేస్తామని, విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని అరచేతిలో వైకుంఠం చూపించి ఓట్లు దండుకుని ఇప్పుడు వెర్రి వేషాలు వేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు" నిర్మాణాలను పూర్తి చేయాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 12:**



ఇందిరమ్మ ఇండ్లు మాడల్ త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో గృహనిర్మాణం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 19 మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల మాడల్ గృహాలు గ్రౌండింగ్ చేయడం జరిగాయని, వాటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. అట్టి నిర్మాణాల పనులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులుపర్యవేక్షించాలని ఆదేశించారు. డోంగ్లి మండలంలో మాడల్ ఇంటి నిర్మాణాన్ని గ్రౌన్డింగ్ చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలకు సిద్ధంగా ఉంటే మార్కవుట్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జడ్పీ సీఈవో చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ శ్రావణ్ కుమార్, పంచాయతీ రాజ్, గృహనిర్మాణ శాఖల ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సుగంధ ద్రవ్యాల సాగుతో అధిక ఆదాయం.





## టియు వైస్ ఛాన్సలర్ టి. యాదగిరిరావు.

## వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు.

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, మార్చి 12**

ఔషధ, సుగంధ ద్రవ్య మొక్కల పెంపకంతో అధిక ఆదాయం పొందే అవకాశలు ఉన్నాయనిటియు వైస్ ఛాన్సలర్ టి. యాదగిరిరావు అన్నారు.తెలంగాణ విశ్వవిద్యాలయంలో బుధవారం కేంద్రియ ఔషధ మరియు సుగంధ ద్రవ్య మొక్కల పరిశోధన కేంద్రం (సి -మ్యాప్) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఔషధ, సుగంధ మొక్కలు మరియు వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఆచార్య టీ. యాదగిరిరావు మాట్లాడుతూ, భారతదేశానికి వ్యవసాయ రంగం వెన్నెముకని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ సుస్థిరతతో ముందుకు వెళ్లాలంటే వ్యవసాయ రంగంలో ఔషధ మరియు సుగంధ ద్రవ్య పంటలను వాణిజ్య పంటలుగా అభివృద్ధి చేయాలన్నారు. వ్యవసాయ రంగంలో క్షేత్రస్థాయిలో నూతన వినూతన మార్పుల ను ఆవిష్కరిస్తూ సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను తగ్గిస్తూ సుగంధ ద్రవ్యాలు మరియు వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని తెలిపారు.రైతులు ఉత్పత్తిని గణనీయంగా పెంచి వాణిజ్య పంటల ఎగుమతిలో అంతర్జాతీయంగా భారతదేశానికి కీలకమైన స్థానంలో నిలబెట్టాలన్నారు. సుగంధ ద్రవ్యాల సాగులో అధిక ఆదాయంతో పాటు సులభతరమైన మార్కెట్ సౌకర్యం కలిగి ఉన్నదని పేర్కొన్నారు. ఔషధ వాణిజ్య పంటల సాగు చీడపీడలకు దూరంగా ఉంటుందని, నీటి వినియోగం తక్కువుగా ఉంటుందని, క్రిమి కీటకాలు ఆశించవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య. ఎం. యాదగిరి మాట్లాడుతూ, ఇంత పెద్ద ఎత్తులో రైతులు విశ్వవిద్యాలయానికి రావడం ఆనందంగా ఉన్నదని తెలిపారు. రైతులు విశ్వవిద్యాలయాలకు వచ్చి శాస్త్రవేత్తలతో, అధ్యాపకులతో అనుభవాలు పంచుకోవడం వల్ల వ్యవసాయ రంగంలో గుణాత్మకమైన

మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి వ్యవసాయ విధివిధానాలను తెలుసుకొని పరిశోధనలు చేసినట్లయితే వ్యవసాయంలో విప్లవత్మకమైన మార్పులు వస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో

కేంద్ర ఔషధ మరియు సుగంధ ద్రవ్య మొక్కల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా. జ్ఞానేష్ ఎసి మాట్లాడుతూ, ఔషధ మరియు సుగంధ మొక్కల సాగు వలన రైతులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఔషధ మరియు సుగంధ మొక్కల సాగుతో పంటలకు తెగుళ్లు మరియు వ్యాధులకు గురికాకుండా నివారించవచ్చునన్నారు.

# చంద్రబాబు కృషితో పోలవరం ముందుకు


## నేటికి రూ. 5052 కోట్ల నిధులు అడ్వాన్స్ గా రాబట్టాంమంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

**అమరావతి:** ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే.. చంద్రబాబు కృషితోనే పోలవరం ప్రాజెక్ట్ కు నేటికి రూ. 5052 కోట్ల నిధులు అడ్వాన్స్ గా రావడం జరిగిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నాడు జగన్ ప్రభుత్వంలో కేంద్రం విడుదల చేసిన పోలవరం రియంబర్స్మెంట్ నిధులను సైతం దారి మళ్లించి ప్రాజెక్ట్ ను విధ్వంసం చేసింది అని ఆరోపించారు. నేడు డబుల్ ఇంజన్ సర్కార్ ఫలితాలు, పోలవరం పనుల ప్రగతిలో కనిపిస్తున్నాయని వెల్లడించారు. అంతర్జాతీయ నిపుణుల కమిటీ, ఎప్పటికప్పుడు సమన్వయ పర్చుకుంటుందని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. ఇక, 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా, డిజైన్స్ కు అనుమతులు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. డయాఫ్రమ్ వాల్ పనులకు ప్రస్తుతం రెండు కట్టర్లను ఉపయోగిస్తూ.. 136 మీటర్ల పొడవున, 6700 చదరపు మీటర్లు నేటికి పూర్తి చేయడం జరిగింది అని చెప్పారు. ఏప్రిల్ మొదటివారం నుంచి డి వాల్ నిర్మాణానికి మూడో కట్టర్ కూడా అందుబాటులోకి రానుందన్నారు. 7 ఏళ్ల తరువాత నిర్వాసితుల బాధలను ఉపశమించడానికి.. కూటమి ప్రభుత్వం 990 కోట్ల రూపాయలను ఒకే విడతగా వారి వారి ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

# నాణ్యమైన విద్య లక్ష్యంగా "నలంద" విద్యా సంస్థ స్థాపన.

- ➢ చిరు "దీపం"గా మొదలై ఆర్మూర్ ప్రాంతానికి వెలుగులు.
- ➢ కార్పోరేట్ కు ధీటుగా విద్యార్థులకు విద్యా బోధన.
- ➢ బావి భారత విద్యార్థులను తీర్చి దిద్దడం కోసం అన్నదమ్ముల కఠోర శ్రమ.
- ➢ జాతీయ స్థాయి విద్య అందించేందుకు యాజమాన్యం ప్రసాద్, సాగర్ ల కృషి.
- ➢ నేడు "నలంద హై స్కూల్" 21 వ వార్షికోత్సవం.

"నాణ్యమైన విద్య లక్ష్యంగా "నలంద" విద్యా సంస్థను 21 ఏళ్ల క్రితం స్థాపించారు. చిరు "దీపం" గా మొదలైన విద్యా సంస్థ ప్రస్థానం ఆర్మూర్ ప్రాంతానికి వెలుగులు నింపుతుంది. కార్పోరేట్ కు ధీటుగా విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ, బావి భారత విద్యార్థులను తీర్చి దిద్దడం కోసం అన్నదమ్ముల కఠోర శ్రమ చేస్తున్నారు. జాతీయ స్థాయి విద్య అందించేందుకు యాజమాన్యం ప్రసాద్, సాగర్ ల కృషి ఎంతగానో ఉంది. "నలంద హై స్కూల్" 21 వ వార్షికోత్సవం సంబరాలు గురువారం జరుపనున్నారు".










**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, మార్చి 12:**

నలంద స్కూల్ 2004 సంవత్సరంలో వెంకటేశ్వర కాలనీ, మామిడిపల్లిలో గల వెంకటేశ్వర టెంపుల్ దగ్గర స్థాపించడం జరిగింది. ఆ సంవత్సరం 60 మంది విద్యార్థులతో ప్రారంభించగా, ప్రతి సంవత్సరం విద్యార్థుల అభివృద్ధి గురించి ఆలోచిస్తూ వారిని చదువులో ముందుండే విధంగా వారిని తీర్చిదిద్దారు. తర్వాత 2011- 12 సంవత్సరంలో మామిడిపల్లి హైదరాబాదు రోడ్డు పక్కనగల సొంత స్థలంలో ఓన్ బిల్డింగ్ ని నిర్మించారు. అప్పుడు స్కూలు విద్యార్థుల సంఖ్య 320 తర్వాత దిన దిన అభివృద్ధి చెందుతూ ప్రస్తుతం 2024-25 సంవత్సరంలో 830 విద్యార్థులతో ముందుకు దూసుకెళ్తుంది.

**విద్యార్థుల, తల్లిదండ్రుల సహకారం మరువలేనిది: యాజమాన్యం.**

విద్యా సంస్థ ఎదుగుదలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మా తల్లిదండ్రులు సహకారం ఎంతో ఉందని యాజమాన్యం ప్రసాద్, సాగర్ లు పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అకాడమిక్ ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ విద్యార్థుల ఎదుగుదలలో తోడ్పాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. వారిని చదువుతోపాటు క్రీడాలో కూడా ప్రతి సంవత్సరం జరిగే మండల స్థాయి గేమ్స్ లో మార్చి ఫస్ట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ , మరియు అథ్లెటిక్స్ లో కూడా మంచి ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులని సన్నద్ధం చేయడం జరుగుతుందన్నారు. అకాడమిక్స్ వైపు చెప్పాలంటే నలంద స్కూల్లో ఒలంపియాడ్, ఐఐటి , అబాకస్ మరియు విద్యార్థులు ఇంగ్లీష్ లో మాట్లడే విధంగా వారికి ఇంగ్లీష్ ల్యాబ్, కరికులంస్ ని విద్యార్థులకు బోధించడం జరుగుతుందన్నారు. ఏదో ఐఐటి, ఒలంపియాడ్ చెప్తున్నారే అని కాకుండా విద్యార్థులకు ఎప్పటికప్పుడు ప్రతి నెల ఓయుటి -1 లాంటి పరీక్షలు, ఆర్ - ఎంఎం, ఆర్ - ఎస్ఎం, మెగా ఒలంపియాడ్, డి- మాట్, కె - సాట్ కాంపిటీటివ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అభ్యస్, హైదరాబాద్ ఒలంపియాడ్, ఐఐటి కాంపిటేటివ్ పరీక్షలు నిర్వహిస్తూ వాటిలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వీటితోపాటు సైన్స్ డే, మ్యాథ్స్ డే లాంటి కార్యక్రమాలని నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి కల్చరల్ ఆక్టివిటీస్, స్టేజ్ ఫియర్ పోగొట్టడానికి వారికి స్పీచ్ ఆక్టివిటీస్ నిర్వహిస్తున్నామని చెప్పారు.




ప్రతి క్లాస్ రూం లో టీవీ, విద్యార్థులకు ఉపాధ్యాయులు ట్యాబ్ తో పాటు డిజిటల్ క్లాస్ ద్వారా బోధించడం జరుగుతుందన్నారు. నలంద 21వ వార్షికోత్సవం సందర్భంగా తమకు అన్ని విధాల సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

**నలంద స్కూల్ 21 వ వార్షికోత్సవం**

ఆర్మూర్, మామిడిపల్లిలో గల నలంద స్కూల్ 21 వ వార్షికోత్సవ సంబరాలు గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నలంద స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు మరియు బంధుమిత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పాఠశాల యాజమాన్యం ప్రసాద్ , సాగర్ లు కోరారు.